## రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు ఈనెల 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 5వేల మందికి పైగానే విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు విధిగా హాల్ టికెట్ తప్పనిసరిగా తమ వెంట తీసుకువెళ్లాలని డీఈవో రేణుకాదేవి సూచించారు

# పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు


మాట్లాడుతున్న జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్

- మేడ్చల్ జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్

మేడ్చల్ జూన్ 1(ఆంధ్రజ్యోతి) : ఈనెల 4న మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపుపై ఏఆర్‌వో, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఏడు సెగ్మెంట్లలో పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపునకు 20 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఓట్ల లెక్కింపు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు కంటే ముందు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఎక్కడా పొరపాటు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్యామ్ ప్రకాష్, శిక్షణా నోడల్ అధికారి కేశురామ్, డిస్ట్రిక్ట్ లెవల్ మాస్టర్స్ ట్రైనర్స్ తిరుమలేశ్, గోపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




విద్యుత్ వెలుగుల్లో
మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్

# అంబురాన్నంటేలా..

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు భారీ ఏర్పాట్లు

- తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం
- కలెక్టరేట్లలో జాతీయ పతాకం ఎగురవేయనున్న కలెక్టర్లు
- అంతకు ముందు అమర వీరుల స్థూపాల వద్ద నివాళులు
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆర్భాటం లేకుండా ఉత్సవాలు

"తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అంబరాన్నంటేలా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల విజయవంతానికి మూడు జిల్లాల కలెక్టర్లు అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ల ప్రాంగణాలు, వివిధ కార్యాలయాలు పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో వేడుకలు నిరాడంబరంగా జరగనున్నాయి.

వికారాబాద్/మేడ్చల్ జూన్1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలు ముస్తాబయ్యాయి. తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్లు, చౌరస్తాల్లో విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా పెద్దఎత్తున సాంస్కృతిక ఉత్సవాలు, ధూంధాం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అధికారిక ఉత్సవాలు జరపనున్నారు. ఆదివారం ఉదయం రంగారెడ్డి జిల్లా కలెకరేట్‌లో వద్ద కలెక్టర్ శశాంక ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం కలెక్టర్ తెలంగాణ ఆవిర్భావాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 8.35 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో నిర్మించిన అమరవీరుల స్థూపం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర అధికారులు, ప్రముఖులు నివాళులర్పిస్తారు. అనంతరం 9గంటలకు కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణతో కలెక్టర్ గౌతమ్ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లోని వేడుకలకు మహేశ్వరం డీసీపీ విచ్చేస్తున్నారు.

### తమదైన ముద్ర

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 2024 జూన్ 2వ తేదీ నాటికి పదేళ్లు పూర్తి కానుంది. ఈ ఉత్సవాలు నిర్వహించడంలో తమదైన ముద్ర వేయాలని ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరో వైపు బీఆర్‌ఎస్ పార్టీ హడావుడి చేస్తున్నాయి. పోటాపోటీగా వేడుకల నిర్వహణకు సిద్ధమయ్యాయి. నేడు జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకునేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలి సారిగా నిర్వహిస్తున్న ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా జరిపేందుకు సిద్ధమైంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఇలా అన్ని వర్గాల ప్రజలు వేడుకల్లో భాగస్వాములు కానున్నారు.


రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు


### ప్రజాప్రతినిధుల ప్రసంగాలు లేకుండానే..

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజా ప్రతినిధుల ప్రసంగాలు లేకుండానే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు కొనసాగనున్నాయి. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిరాడంబరంగా జరగనున్నాయి. వివిధ శాఖల కార్యాలయాల్లో సంబంధిత అధికారులు జాతీయ పతాకం ఎగురవేస్తారు. ప్రత్యేకాధికారుల పాలన సందర్భంగా గ్రామాల్లో వారే జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. ప్రత్యేకాధికారికి రెండు నుంచి మూడు పంచాయతీల బాధ్యతలు ఉంటే వారి స్థానంలో కార్యదర్శులు జాతీయ పతాకం ఎగురవేస్తారు.

### సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానాలు

తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా అయా జిల్లా కేంద్రాల్లో విద్యార్థుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


మేడ్చల్‌లో..


వికారాబాద్ కలెక్టరేట్

### బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో...

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటి రోజు సాయంత్రం 6గంటలకు మహేశ్వరంలోని జిల్లేలగూడ చందన చెరువు వద్ద అమరవీరుల స్తూపం వద్ద అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరు కానున్నారు. జూన్ 3వ తేదీన రెండోరోజు ఎక్కడికక్కడే జాతీయ జెండాను, బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఆయా మండల, మున్సిపల్, కార్పొరేషన్, డివిజన్ పరిధిలోని ఆసుపత్రులు, అనాథ ఆశ్రమాల్లో పండ్లు, స్వీట్లు పంపిణీ చేయనున్నారు. పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ఉద్యమకారులు కలిసికట్టుగా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన


పనుల గురించి తెలుసుకుంటున్న ఏఎస్పీడీ రమేశ్

బొంరాస్‌పేట్, జూన్ 1 : చౌదర్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్, బొంరాస్‌పేట్ ప్రాథమిక, బాలికల ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మనఊరు-మనబడి పథకంలో భాగంగా చేసిన పనులను రాష్ట్ర సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రమేశ్ శనివారం పరిశీలించారు. బొంరాస్‌పేట్ ఉన్నత పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో విద్యార్థులకు కుడుతున్నయూనీఫాంలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నింటికీ ఆధారం..కుటుంబ సర్వే!

- పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చర్యలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలకు అడ్డుకట్ట


ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మేడ్చల్ జూన్ 1(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ఇంటింటా సర్వే చేపడుతోంది. కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, బాలామృతం వంటివి లబ్ధిదారుల వరకు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రికార్డుల్లో రాసే విధానానికి చెక్ పెట్టనున్నారు. కేంద్రాల్లో జరిగే అవకతవకలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం న్యూట్రీషియన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం పేరిట సర్వే చేపడుతోంది. మార్చి నెల నుంచి సర్వే ప్రారంభం కాగా ఎన్నికల కోడ్ రావడంతో నెమ్మదిగా సాగింది. ఎన్నికలు ముగియడంతో సర్వే పనులు వేగవంతం చేశారు. జిల్లాలో మేడ్చల్, అల్వాల్, కుత్బుల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలుంటాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌టీఎస్‌సర్వే చేపట్టారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ఇంటింటికి సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల వయస్సు, ఫోన్ నంబరు, కులం, ఉపకులం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నంబర్లను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, 6ఏళ్లలోపు చిన్నారులు, దివ్యాంగుల వివరాలను సైతం నమోదు చేస్తున్నారు.

### వస్తువులు పక్కదారి పట్టకుండా..

ఈ సర్వే పూర్తితో అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే వస్తువులు ఇకపై పక్కదారి పట్టకుండా ఉంటాయి. గతంలో కేంద్రానికి బాలింతలు, గర్భిణులు హాజరుకాకపోయినా వచ్చినట్లు రాసేవారు. ఇకపై లబ్ధిదారులు కేంద్రానికి వచ్చి భోజనం చేస్తేనే హాజరైనట్లు , కేంద్రానికి రాకుంటే ఫోన్ నంబరకు మెసేజ్ వెళ్తుంది. ఈ సర్వేతో తీవ్ర పోషకాహార సమస్యతో బాధపడే పిల్లల సంఖ్య తెలుస్తోంది. అంగన్‌వాడీలకు వచ్చే వారికి ఒకపూట భోజనం అందిస్తున్నారు. ఇందులో బాలింతలు, గర్భిణులకు రోజుకు బియ్యం 150 గ్రాములు, కందిపప్పు 30 గ్రాములు, నూనె 16 గ్రాములు, పాలు 200 మిల్లి లీటర్లు, ఒక గుడ్డు ఇవ్వాలి.

## నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి



షాపులో తనిఖీ చేస్తున్న గోపాల్

మోమిన్‌పేట్, జూన్ 1: ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ సూచించారు. శనివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జయశంకర్‌తో కలిసి ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. రైతులు బిల్లులు లేకుండా విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయరాదని తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మోమిన్‌పేట్ వ్యవసాయ విస్తరణాధికారి పెంటయ్య పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
## తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

» గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్

» గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

### ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

» బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వాలుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

» నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

# ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

**గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?**

» 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక

» రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహియొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్థక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



### కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

### మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్థకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్థకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్థక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

### విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

### మమ్మల్నెందుకు పిలవలేదు!

» సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న

» ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహ ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

### పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## రాజీమార్గమే రాజమార్గం

● జూనియర్ సివిల్ జడ్జి స్వరూప



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

ఆమనగల్లు, జూన్ 1: రాజీమార్గమే రాజమార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను సత్వరంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్‌లు దోహదపడుతాయని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ఈ నెల 8న నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయా మండలాల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ గురించి కేసుల్లో ఉన్న కక్షి దారులకు సమాచారం అందించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. కక్షిదారులు కేసుల కోసం కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏపీపీ కార్తిక్, సీఐ ప్రమోద్ కుమార్, శివప్రసాద్, విష్ణువర్ధన్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఎస్సైలు బాల్‌రామ్‌నాయక్, వరప్రసాద్, శ్రీకాంత్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీపీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం

● రికార్డుల నిర్వహణ సరిగా లేదు : డీఆర్డీవో



సామాజిక తనిఖీలో పాల్గొన్న శ్రీలతారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, జూన్ 1: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే నర్సరీల్లో పలు గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేదని, దీనికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులపై తగు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలతారెడ్డి అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీ నివేదికపై శనివారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో జరిగిన ఫోరంలో ఆమె పాల్గొన్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో రూ.4.22 కోట్ల విలువచేసే పనులు జరగ్గా.. ఉపాధి హామీ పథకం కింద 331 పనులకుగాను రూ.2.05 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు ఫోరంలో వివరించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 59 పనులకు గాను రూ.1.58 కోట్లు ఖర్చు చేశామన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 13 పనులు చేపట్టి రూ.58.88 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ ఉపాధి పనుల నిర్వహణలో భాగంగా పని ప్రదేశంలో మస్టర్లు సరిగా నిర్వహించని క్షేత్రస్థాయి అధికారులపై కూడా చర్యలు తప్పవన్నారు. అంతేకాకుండా కొలతలు తీసి ఎంబీలు సరిగా నిర్వహించని సాంకేతిక సహాయకులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించాల్సిన ఏడు రికార్డులు మూడు నెలలకోసారి అప్డేట్ చేసి ఎంత పేమెంట్ జరిగిందో కూలీలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో సుభాషిణి, ఏపీడీ సక్రియానాయక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి పద్మ, అంబుడ్స్ పర్సన్ సునీత, ఎంపీడీవో క్రాంతికిరణ్, ఏపీవో తిరుపతాచారి, సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకన్న, విజిలెన్స్ అధికారి కొండయ్యలు పాల్గొన్నారు.

**10 లోపు యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తి చేయాలి**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్‌ను ఈ నెల 10 వరకు పూర్తి చేయాలని మహిళా సంఘాలకు సూచించినట్లు డీఆర్డీవో శ్రీలతారెడ్డి విలేకరుల సమావేశంలో వివరించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య మొత్తం 67,550 మంది కాగా.. వీరిలో బాలికలు 34,930 మంది, బాలురు 32,230 మంది ఉన్నారని తెలిపారు. మొత్తం 87 కేంద్రాల్లో యూనిఫాం కుట్టు పనులు జరుగుతున్నాయన్నారు. 1,239 మంది మహిళలు యూనిఫాంను కుడుతున్నారని ఆమె వివరించారు.

### బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు

● బియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి : డీఎస్వో



తాండూరు రేషన్ డీలర్ల సమావేశంలో పాల్గొన్న డీఎస్వో రాజేశ్వర్

తాండూరు, జూన్ 1: బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, సివిల్ సప్లై వ్యవస్థలో డీలర్ల పాత్ర కీలకమని, ప్రజలకు బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్ అన్నారు. శనివారం తాండూరు సివిల్ సప్లై గోదాంలో డీఎం సుగుణతో కలిసి గోదాంలో గల బియ్యం నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రతీ ఒక్కరు బియ్యం పంపిణీలో సమయపాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా షాపుల వద్ద, ఇతర ప్రాంతాల్లో ఎవరైనా బియ్యం కొన్నా.. అమ్మినా సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎవరైనా బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు గోదాంలో ఏర్పాటుచేసిన కాంటాలపైనే బియ్యం తీసుకోవాలన్నారు. ప్రతీనెల 1వ తేదీ నుంచి 15 వరకు బియ్యం పంపిణీ చేయాలని, కచ్చితంగా 1వ తేదీనే పంపిణీని ప్రారంభించాలని తెలిపారు. ఈపాస్ మిషన్‌లో ఉన్న బియ్యం నిల్వలు రేషన్ దుకాణంలో ఉన్న నిల్వలు సమానంగా ఉండాలని, వేరియేషన్స్ వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంత్యోదయ కార్డులు కలిగిన డీలర్లు పంచదార డీడీలు కట్టాలని, అంత్యోదయ లబ్ధిదారులకు చక్కెర పంపిణీ చేస్తామన్నారు. ప్రతీనెల రెండు నెలలకు ఒకసారి సివిల్ సప్లై గోదాంలలో సమావేశం నిర్వహిస్తామని, డీలర్ల సమస్యలతో పాటు గోదాంలో నెలకొనే సమస్యలపై రివ్యూ నిర్వహించి పరిష్కరిస్తామని తెలిపారు. బియ్యం అక్రమ రవాణాపై డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎం సుగుణ మాట్లాడుతూ డీలర్లకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామ, కాంటాను లీగల్ మెటరాలజీ అధికారులతో తనిఖీ చేయిస్తామన్నారు. గోదాం ఇన్‌చార్జి రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకొని డీలర్లకు సకాలంలో బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గోదాం ఇన్‌చార్జి రవికుమార్, రేషన్ కార్డు డీలర్ల సంఘం తాండూరు, పట్టణ, యాలాల, బషీరాబాద్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

### తునికాకు కూలీల
### బోనస్ డబ్బుల అవకతవకలపై ఫిర్యాదు

● సీఎం, అటవీశాఖ మంత్రి, పీసీసీఎఫ్, సీసీఎఫ్‌లకు ట్విట్టర్‌లో ఫిర్యాదు చేసిన యువకుడు

ధారూరు, జూన్ 1: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో తూనికాకు కూలీల బోనస్ డబ్బులను అధికారులు పక్కదారి పట్టించటం పై సీఎం, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పీసీసీఎఫ్, సీసీఎఫ్‌లకు ధారూరు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యుడు నరేశ్ శనివారం ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లాలోని అన్ని అటవీ రేంజ్‌లలో తూనికాకు కూలీలకు మంజూరైన లక్షలాది రూపాయలు బోనస్ డబ్బులు పక్కదారి పట్టాయని ఆయన పేర్కొన్నాడు. బినామీ పేర్లతో కూలీల బోనస్ డబ్బులను అధికారులు మింగేసిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, మే 29న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'బోనస్ మింగేశారు' అనే కథనం ప్రచురితమవ్వడంతో నరేశ్ దానిని ఫిర్యాదుకు జతచేసి ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

### నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



స్వప్నకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వీసీ క్రిస్టోఫర్

మొయినాబాద్ రూరల్, జూన్ 1: విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటూ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లోని యూనివర్సిటీకి చెందిన వెంకట గోపాల శాస్త్రి వాణిజ్యం మరియు వ్యాపార నిర్వహణ(కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్) విభాగంలో 'ఫిజికల్ అండ్ ఫైనాన్షియల్ పర్ఫార్మెన్స్ ఆఫ్ ఎస్‌బీఐ-ఏ సెలెక్ట్ స్టడీ' అనే అంశంపై డాక్టర్ వెంకట జనార్దన్‌రావు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. అలాగే స్వప్న మెట్టుపల్లి జీవ సాంకేతిక శాస్త్ర విభాగంలో 'స్టడీస్ ఆన్ జెనెటిక్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ డిఫెన్స్ జీన్ అగైనెస్ట్ ఫంగస్ పాతోజెన్ ఇన్ గ్రౌండ్‌నట్ (ఆరానిస్ హైపోజియా)అనే అంశంపై రాజేందర్ వడ్లూరి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. సాత్వికరెడ్డి వారిని శనివారం ప్రత్యేకంగా అభినందించారు. వీసీ క్రిస్టోఫర్, ప్రొఫెసర్ రవీందర్, జగదీశ్వర్, రాజు, ఇతర అధ్యాపకులు, పీఆర్వో రాంబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



చింతపట్లలో బాలికతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

యాచారం, జూన్ 1 : తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. శనివారం యాచారం మండలంలోని చింతపట్ల, నల్లవెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పాఠశాలల పరిస్థితులపై అధ్యయనం చేశారు. ఉపాధి కూలీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయాలంటే ఏం చేయాలని వారిని ప్రశ్నించారు. పేదలకు నాణ్యమైన విద్య అందాలంటే పాలకులు ఏం చేయాలని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. చింతపట్లలో మన ఊరు మనబడి కార్యక్రమంతో పాఠశాలను అభివృద్ధి చేసుకోవడం ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులను అభినందించారు. దాతలు పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. వేసవిలో ప్రతీ పాఠశాలలో ఉచితంగా తరగతులు నిర్వహించి ఆంగ్లంపై ప్రతీ విద్యార్థి పట్టు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. వేసవి శిబిరంతో క్రీడల్లో నైపుణ్యం నేర్పడం అభినందనీయమ, విద్యావంతులు ముందుకు వచ్చి గ్రామస్థాయిలో విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయడానికి ప్రణాళిక రూపొందించాలని అన్నారు. కేవలం విద్యతోనే గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని, ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించడం పాలకుల బాధ్య అని అన్నారు. తాను చర్చించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు వివరించి మీ సమస్యలను తీర్చడం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేపించకుండా ప్రభుత్వానికి వివరించాలని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. పర్యటనలో ప్రొ.లక్ష్మీనారాయణ, ఎన్ఆర్ఐ నిర్మల, ప్రధానోపాధ్యాయుడు జగదీష్, ఉపాధ్యాయులు మల్లేష్, ఎండీ సాబేర్, దాస్, శేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### పార్కు స్థలాన్ని పరిరక్షించాలి



ధ్వంసమైన పార్కు కంచె శిథిలాలను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 1 : మున్సిపాలిటీకి చెందిన 8వేల చదరపు గజాల పార్కు స్థలం పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కౌన్సిలర్ రాజశేఖర్‌తో కలిసి వేంకటేశ్వర లేఅవుట్‌లోని పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లో ప్రజాప్రయోజనాల కోసం వదిలేసిన 8వేల చదరపు గజాల స్థలంనకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో 45ఏళ్ల క్రితం లేఆవుట్ అయిన స్థలానికి ఎలాంటి విచారణ జరుపకుండానే పాసుపుస్తకాలు ఇవ్వడం రెవెన్యూ అధికారుల తప్పిదమే అవుతుందన్నారు. ఈవిషయమై అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే స్థానికులు కొందరు ఆక్రమణకు యత్నిస్తున్నారని వాపోయారు. తాజాగా పార్కు స్థలంలో పనులు చేసేందుకు హిటాచీ వాహనాన్ని తీసుకురావడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రహరీని ధ్వంసంచేసిన కబ్జాదారులపై కేసు నమోదయ్యిందని, తిరిగి హిటాచీ యంత్రాన్ని తీసురావడం సరికాదన్నారు. ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలంలో ఎలాంటి పనులు జరుగకుండా చూడాలని అధికారులకు వివరించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపి పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేయడంతోపాటు మున్సిపాలిటీ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, ఈ స్థలం తమదని ఓ ప్రైవేట్ వ్యక్తి ఏర్పాటు చేసిన బోర్డును తొలగించిన మున్సిపల్ అధికారులు.. ఈ స్థలం మున్సిపాలిటీ స్థలమని నూతన బోర్డును ఏర్పాటు చేశారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

శామీర్‌పేట, జూన్ 1: మండల కేంద్రం, తూంకుంట మున్సిపల్‌లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ విగ్రహాలకు అభిషేకాలను నిర్వహించారు. శామీర్‌పేట శ్రీభవానిరామ లింగేశ్వర్‌స్వామి ఆల యంలో ప్రధానర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి చందనపూజ చేశారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవస్థానం సన్నిధిలో అభిషేకం, చందన పూజ కార్యక్రమాలను జరిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను భారీ ఎత్తున నిర్వహించారు. ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.

**ఘట్‌కేసర్:** హనుమాన్ జయంతి వేడుకలు ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడలో, బాలాజీనగర్, ఎన్‌ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్, అన్నోజిగూడ, నారపల్లిలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడిగూడలోని దండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రీతిపాత్రమైన వడలను మాలలు తయారు చేసి అలంకరించారు.


దేవరయాంజాల్‌లో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఈటల రాజేందర్

**ఘట్‌కేసర్ రూరల్:** హనుమాన్ జయంతి వేడుకలను మండలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహిచారు. అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం, మర్రిపల్లిగూడ, ఎదులాబాద్, ఘనాపూర్, కొర్రెముల, వెంకటాపూర్, కాచవానిసింగారం, ప్రతాప్ సింగారం తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మర్రిపల్లిగూడ శ్రీబాలాంజనేయస్వామి ఆలయంలో ఉదయాన్నే హనుమాన్ చాలీసా పఠనం, శ్రీరామనామ స్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి హోమాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈదుగల్ల బాలకృష్ణ, రాపోలు నరేష్, చిలుగూరి హరికృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎదులాబాద్‌లోని ఊరానుమాన్ ఆలయం, తిరుమలయ్య బండ వద్ద హనుమాన్ ఆలయం వద్ద జవ్వాజీ లింగం ముదిరాజ్ భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.


కులకచర్ల: రాంరెడ్డిపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**కీసర:** కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర, చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు మండల కేంద్రం కీసర ప్రసన్నాంజనేయ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తెల్లవారుజాము నుంచే స్వామివారి అభిషేకాలు, మనుసూక్త హోమాలు నిర్వహించారు.

**కీసర రూరల్:** నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలోని ఆలయాల్లో మన్యసూక్త పూర్వకంగా హోమాలు, పంచామృత చందనాభిషేకాలతో స్వామిని పూజించారు. నాగారం మున్సిపాలిటీలోని సత్యనారాయణ కాలనీలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అన్నంరాజ్ శ్రీనివాస్, కౌన్సిలర్ లావణ్య పాల్గొన్నారు.

**కులకచర్ల:** మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. మాజీ ఉప సర్పంచ్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

**కొడంగల్:** పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వరహా స్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామికి విశేషంగా పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పసుపు, చందనం లాంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మూడుచింతలపల్లి, జూన్ 1: మండలం పరిధిలోని ఉద్దమర్రి గ్రామ పరిధిలో అక్కన్న మాదన్నలు ప్రతిష్ఠించిన శ్రీ విష్ణు శివాలయంలో వేంకటేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, శ్రీ భవాని రామలింగేశ్వర స్వామిలను ఎదుర్కోలుగా ఆలయానికి తీసుకువచ్చి సుందరంగా అలంరించిన కల్యాణ వేదికపై దేవతా మూర్తుల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మంద శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింహులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులకు ఘన నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి, జూన్ 1: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా అమరవీరులకు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. పరిగిలోని అమరవీరుల చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, మండలపార్టీ మాజీ అధ్యక్షుడు బి.ప్రవీణ్‌రెడ్డిలు మాట్లాడుతూ.. అమర వీరుల త్యాగఫలితే తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కౌన్సిలర్లు టి.వెంకటేశ్, ఎదిరె కృష్ణ, బి.నాగేశ్వర్‌రావు, నాయకులు బి.రవికుమార్, అన్వర్‌హుస్సేన్, రాకేష్, గౌస్‌పాష, ఆసిఫ్ పాల్గొన్నారు.

## డ్రైవర్, కండక్టర్ల కృషితోనే ఓఆర్ పెరుగుదల


తాండూరు ఆర్టీసీ ఆవరణలో మొక్క నాటుతున్న ఆర్‌ఎం

తాండూరు, జూన్ 1: గతంతో పోలిస్తే తాండూరు ఆర్టీసీ డిపో ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) గణనీయంగా పెరిగిందని, ఇది డ్రైవర్, కండక్టర్లు ఉద్యోగుల కృషి ఫలితమేనని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పురుషోత్తం అన్నారు. ఆయన శనివారం తాండూరు ఆర్టీసీ డిపో, బస్టాండ్ లను రీజినల్ మేనేజర్ (ఆర్‌ఎం) రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరిరామ్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. ఆర్థిక లావాదేవిలు జరిపే ఎర్నింగ్ సెక్షన్ లో పూజలు నిర్వహించారు. ప్రతి రోజు ఎంత మంది ప్రయాణం చేస్తున్నారు రాబడి ఎంత వస్తుంది ఇతర కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఆర్టీసి ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం అయ్యారు. డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఆయన ప్రశంసా పత్రాలను అందించి, అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు 100 డిపోలను పరిశీలన చేశానని, గతంతో పోలిస్తే అన్ని డిపోల్లో మార్పు కనిపిస్తుందన్నారు. అనంతరం బస్టాండ్ దుకాణ సముదాయాలను తనిఖీ చేశారు. సామగ్రిని పరిశీలించి వ్యాపారాలు బాగా చేసుకొని ఆర్టీసీకి బకాయిలు లేకుండా అద్దె చెల్లించి సంస్థకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం రాజు, డీఆర్‌ఎం సరిరామ్, డిపో మేనేజర్ సమత, సీఐ నిర్మల, సూపరింటెండెంట్ రవి కిరణ్, వెల్ఫేర్ సభ్యులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 1: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్టు కేసు నమోదు చేయనున్నట్లు ఘట్‌కేసర్ ఎఈవో జగదీష్ హెచ్చరించారు. మండలంలోని ఎదులాబాద్ రైతు వేదికలో శనివారం విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు సుక్కయ్య, రాజిరెడ్డి, మంకం శ్రీనివాస్, అంజయ్య, సంతోష్‌రెడ్డి, జెనిగె లింగం తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు రూరల్:** తాండూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్ డీలర్లు రైతులను చైతన్య పర్చాలని తాండూరు వ్యవసాయశాఖ ఏడీఏ రుద్రమూర్తి పేర్కొన్నారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏవో రజిత ఆధ్వర్యంలో బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాలకు చెందిన ఫర్టిలైజర్లతో నకిలీ విత్తనాల కొనుగోలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బషీరాబాద్ మండలంలోని ఎక్మాయి, మంతట్టి, యాలాల పరిధిలోని రాస్నం గ్రామాల్లో నకిలీ విత్తనాలు పట్టుబడటం సిగ్గుచేటని అన్నారు. గడువు ముగిసిన విత్తనాలు, రసాయన ఎరువులను అమ్మితే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. తాండూరు రూరల్ సీఐ ఎన్.అశోక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు రజిత, సూర్యనారాయణ, యాదగిరి, నసీరుద్దీన్, ఏఈవో శ్రీనివాస్, రైతులు ఉన్నారు. కాగా, మండలంలోని గౌతాపూర్‌లో ఏడీఏ రుద్రమూర్తి ఉపాధి హామీ కూలీలు, రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు.


తాండూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రుద్రమూర్తి

**ధారూరు:** మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, విత్తన విక్రయ దుకాణాలను శనివారం వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో స్టాక్, సేల్ రిజిస్టర్‌లను వారు పరిశీలించారు. విత్తనాల నిల్వలను పరిశీలించి విత్తనాలు ఎవరికి విక్రయిస్తున్నారో వారు తనిఖీ చేశారు. కాగా నకిలీ పత్తివిత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని వ్యవసాయ అధికారి రూప్సీలక్ష్మీబాయి, ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్‌లు హెచ్చరించారు.

**మేడ్చల్ టౌన్:** వ్యవసాయం కోసం నాణ్యమైన విత్తనాలు వాడాలంటూ వ్యవసాయ శాఖ అధికారులు శనివారం మండలంలోని గౌడవెల్లిలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు వ్యవసాయ శాఖ ఏఓ అర్చన తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ముస్తాబు


ముస్తాబైన మోమిన్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం

వికారాబాద్, మే 1 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జిల్లా కేంద్రం ముస్తాబైంది. కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌లో విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కాంతులతో దర్శనమిస్తుండగా వికారాబాద్‌లోని అమరుల స్తూపానికి నివాళులర్పించేందుకు సిద్ధం చేశారు.

**మోమిన్‌పేట్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. ఆదివారం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.

**కొడంగల్/బొంరాస్‌పేట్:** తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 8:45 గంటలకు కొడంగల్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జెండా ఆవిష్కరించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**తాండూరు:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేడు (ఆదివారం) యాలాలలో జెండా కార్యక్రమం ఉంటుందని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

**కొడంగల్ రూరల్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేయనున్నట్లు తెలిపారు.

## హామీలను నిలబెట్టుకోవాలి

వికారాబాద్, జూన్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు మంచన్‌పల్లి సురేష్ ఒక ప్రకటనలో కోరారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందితేనే అమరులకు నిజమైన నివాళులు అని పేర్కొన్నారు.

## కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయం

బంట్వారం(కోట్‌పల్లి) జూన్ 1: అమ్మవారి ఆశీస్సులతో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయమని యువ నాయకులు కొండా విశ్వజిత్‌రెడ్డి, వడ్ల నందు అన్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీనల్లపోచమ్మ ఆలయం రెండవ వార్షికోత్సవాల్లో శనివారం వారు పాల్గొని అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రేపటి నుంచి బడిబాట

బషీరాబాద్, జూన్ 1: రేపటి(సోమవారం) నుంచి చేపట్టే బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ విధిగా పాల్గొని జయప్రదం చేయాలని బషీరాబాద్ విద్యాధికారి సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. మొదటి రోజు ఆయా గ్రామాల్లో హెచ్‌ఎంలు గ్రామ సమాఖ్య సభ్యులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు.

## 62 మంది ఉద్యమకారులకు ఆహ్వానం

తాండూరు, జూన్ 1: హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద జరిగే రాష్ట్ర స్థాయి తెలంగాణ ఆవిర్భావ వేడుకలు తాండూరు నుంచి 62మంది తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం లభించింది. ఆదివారం జరిగే ఈ ఉత్సవాలకు ప్రత్యేక బస్సులో జేఏసీ నేత సోమశేఖర్, ఆర్.విజయ్‌కుమార్, పి.రంగారావు, ఎస్.మహేందర్‌రెడ్డి, కరుణం పురుషోత్తంరావు, ఎస్.చంద్రశేఖర్, కమల్ అత్తార్, జేఏసీ నాయకులు కె.కృష్ణారావు, ఆకుల నందకుమార్, పెద్దేముల్ టీజేసీ ప్రతినిధి పి.రవికాంత్, డాక్టర్స్ జేసీ ప్రతినిధి డాక్టర్ డి.రవి శంకర్, డాక్టర్ జయప్రసాద్, జడ్పీ వైస్‌చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, యాలాల మండల జేఏసీ నుంచి గాజుల బస్వరాజ్, విద్యార్థి జేఏసీ నుంచి సంజయ్‌గౌడ్, జర్నలిస్టుల ప్రతినిధులుగా శెట్టి రవిశంకర్, లింగేశ్, కళాకారుల తరఫున కేశవులు, సంధ్య, అర్చన, నాగలక్ష్మి, మహిళా జేఏసీ నుంచి శకుంతల, బీజేపీ తరఫున పటేల్ విజయ్‌కుమార్, యు.రమేష్ కుమార్, ఎన్ఆర్ఐ ప్రతినిధి పటేల్ రవిశంకర్‌కు అవకాశం దక్కింది.

## క్రీడల్లో రాణించాలి

శామీర్‌పేట, జూన్ 1: జిల్లా క్రీడాకారులు అంచలంచలుగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొని అత్యుత్తమ పథకాలను సాధించి గొప్ప పేరు ప్రతిష్ఠలను తేవాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ హితవు చెప్పారు. శామీర్‌పేట తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో శనివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా స్థాయిలో మెన్, ఉమెన్ క్రీడాకారులకు అండర్ 8, 10, 12, 14, 16, 18, 20 ఏజ్ గ్రూపుల్లో అథ్లెటిక్స్ క్రీడా పోటీలను స్పోర్ట్స్ స్కూల్ స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్ బోస్ ప్రారంభించారు.

## సెమినార్ ప్రారంభం

మేడ్చల్ టౌన్, జూన్ 1: కండ్లకోయం సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఏకో ఫ్రెండ్లీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ప్లాస్టిక్‌కు బదులుగా ఏకో ఫ్రెండ్లీ సంచుల తయారీ చేసే విధానం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.



## సంక్షిప్తంగా..

● **కీసర:** రోడ్డు కబ్జాపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలోని పలువురు గ్రామపంచాయతీ అధికారికి శనివారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 223, 224లో గత కొన్ని సంవత్సరాల క్రితం లేఔట్‌ను చేసి శ్రీనివాస్ నగర్ కాలనీని ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల కొంత మంది రియల్టర్లు 30 ఫీట్ల రోడ్డును కబ్జా చేశారని శ్రీనివాస్ నగర్ కాలనీ వాసులు పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు.

● **బొంరాస్‌పేట్:** రాష్ట్రంలో ప్రతీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఏకరూప దుస్తులను పంపిణీ చేయనుండటంతో శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బాపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలోని మహిళా సంఘాల టైలరింగ్ కేంద్రాల దగ్గర విద్యార్థులతో ఏక రూప దుస్తులను మహిళా సమాఖ్య సీసీ రాంచందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ తదితరులు పరిశీలించి ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోపు విద్యార్థులకు యూనిఫాంలను అందించనున్నట్లు మహిళా సంఘాల సభ్యులు తెలిపారు.

● **వికారాబాద్:** ఈనెల 5వ తేదీన ఏకే ఆర్ స్టడీ సర్కిల్ లో డీఎస్సీ పైన ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఈ సదస్సుకు ప్రముఖ కరెంట్ అఫైర్స్ నిపుణులు వైజాగ్ రవి, పర్స్పెక్టివ్ నిపుణులు కాకినాడ దుర్గాప్రసాద్ ఏకే ఆర్ సర్కిల్ డైరెక్టర్ బీవీ రమణ తెలిపారు. వివరాలకు 944102257 నెంబరును సంప్రదించాలన్నారు.

● **కులకచర్ల:** బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గంగారం తెలిపారు. ఆయన శనివారం కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉండగా ఎంపీసీ గ్రూపులో 40సీట్లలో 36ఖాళీగా ఉన్నాయని తెలిపారు. బైపీసీ గ్రూపులో 40సీట్లకు 37 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

● **మోమిన్‌పేట్:** ప్రభుత్వ పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలని మోమిన్‌పేట్ ఇన్‌చార్జి ఎంపీడీవో యాదగిరి, ఎంఈవో గోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం 52 అమ్మ ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ధారూరు:** ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం మొక్కజొన్న, ధాన్యం పంట ఉత్పత్తుల క్రయవ్రియాలు నిర్వహించారు. మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,170ల నుంచి రూ. 2,340 వ రకు, ధాన్యం 1010 రకం క్వింటాలుకు రూ.2100, సోనా మసూరి రకం క్వింటాలుకు రూ. 2,280 నుంచి 2,440 వరకు బీట్లలో ఖరీదుదారులు కొనుగోలు చేశారు. మొక్కజొన్న 637.5 క్వింటాళ్లు, ధాన్యం 1010 రకం 642.4 క్వింటాళ్లు, సోనామసూరి 649.2 క్వింటాళ్లు విక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారులు తెలిపారు.

● **ధారూరు:** వేసవి సెలవులలో పాఠశాలల్లో విధులు నిర్వహించిన హెచ్‌ఎంలకు సంపాదిత(ఈఎల్ఎస్) సెలవులు మంజూరు చేయాలని మండల పీఆర్‌టీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేయించిన ప్రధానోపాధ్యాయులకు ఈఎల్ఎస్ ఇవ్వాలని వారు ఎంపీడీవో నర్సింలు, ఇన్‌చార్జి ఎంఈవో బాబుసింగ్‌లకు శనివారం వినతి పత్రం సమర్పించారు.

## క్రైం కార్నర్

### గ్రూప్ పరీక్షలకు ప్రిపేరవుతున్న యువతి ఆత్మహత్య


సంగీత (ఫైల్)

మేడ్చల్ టౌన్, జూన్ 1 : గ్రూప్-1, గ్రూప్-4 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన సంగీత(24), మేడ్చల్ పట్టణంలోని రాఘవేందర్ నగర్ కాలనీలో తన తమ్ముడు కృష్ణసాయితో కలిసి అద్దెఇంట్లో ఉంటుంది. కాగా కృష్ణసాయి రత్నదీప్ ప్రైవేటు లిమిటెడ్‌లో డాటా ఎంట్రీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. సంగీత గ్రూప్-1, గ్రూప్-4 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నది. ఈ క్రమంలో శనివారం కృష్ణసాయి ఇంటి నుంచి బయటకు వెళ్లగా సంగీత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా గ్రూప్ పరీక్ష పట్ల సంగీత రెండు రోజులుగా టెన్షన్ పడుతున్నట్లు తమ్ముడు సాయికృష్ణ ఫిర్యాదులో పోలీసులకు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

### రైలు ఢీకొని వ్యక్తి మృతి


రాజు మృతదేహం

వికారాబాద్, జూన్ 1: రైలు ఢీకొని ఓవ్యక్తి మృతిచెందిన ఘటన వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రవల్లి గ్రామ సమీపంలోని రైల్వే గేటు వద్ద శనివారం ఉదయం రైలుకింద పడి వ్యక్తి మృతిచెందాడని సమాచారం రావడంతో అక్కడి చేరుకున్న రైల్వేపోలీసులు మృతుడిని గుర్తించారు. మృతుడి వద్ద డ్రైవింగ్ లైసెన్సు ఫొటో లభించగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారంనకు చెందిన రాజుగా గుర్తించారు. మృతదేహాన్ని వికారాబాద్ మార్చురికి తరలించినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు 9989355134 నెంబర్‌ను సంప్రదించాలని రైల్వేపోలీసులు తెలిపారు.

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ..

కులకచర్ల, జూన్ 1: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన వివాహిత రాధిక(24) పాలమూర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. ఆమె మృతికి అత్తింటివారే కారణమని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. కులకచర్ల ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం భూనీడ్ గ్రామానికి చెందిన రాధికను మండలంలోని బండ వెల్కిచర్ల గ్రామానికి చెందిన చాకలి ఆంజనేయులుతో 2019లో వివాహం జరిపించారు. వీరికి ఒక కూతురు ఉండగా ముగ్గురు పిల్లలు పుట్టి చనిపోయారు. కాగా గురువారం రాత్రి రాధిక అస్వస్థతకు గురైందని పాలమూర్ ఆసుపత్రికి తీసుకెళ్తున్నామని ఆమె సోదరుడు రఘునాథ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు మరుసటి రోజు శుక్రవారం ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో శనివారం ఆమె మృతిచెందింది. రాధిక మృతిపై అనుమానం ఉందని, అందుకు అత్తింటి వారే కారణమని చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు రఘునాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### టిప్పర్ కింద సేదతీరుతూ వ్యక్తి..

మేడ్చల్ టౌన్, జూన్ 1: ఆగి ఉన్న లారీ టిప్పర్ కింద సేద తీరుతున్న క్వారీ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావల్‌కోల్ గ్రామపరిధిలోని ర్యాంక్ సిలికార్ క్రషర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న వెంకటయ్య(55) శనివారం తమ క్రషర్ వద్ద ఆగి ఉన్న లారీ టిప్పర్ కింద నీడకు సేద తీర్చుకుంటుండగా, లారీ టిప్పర్ డ్రైవర్ లారీ కిందున్న వెంకటయ్యను గమనించకుండా లారీ తోలటంతో అతడు లారీ చక్రాల కిందపడి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఓఆర్ఆర్‌పై లారీ బోల్తా


కీసరదాయర వద్ద ఓఆర్ఆర్ పైనుంచి పడిన పప్పులోడ్‌తో వెళ్తున్న లారీ

కీసర రూరల్, జూన్ 1: కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓఆర్ఆర్‌పై శనివారం ఓ లారీ బోల్తాపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ నుంచి బెంగుళూరుకు కందిపప్పును తరలిస్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఓఆర్ఆర్‌పై బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ సచిన్ సురక్షితంగా బయటపడ్డాడు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. లారీలోని బ్యాగులు చిరిగి కంది పప్పు చెల్లాచెదురుగా పడింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాత

ధారూరు, జూన్ 1: పొలంలో తెగిన పడిన విద్యుత్‌తీగలు తగిలి మూడు మేకలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన మండలంలోని మోమిన్‌కలాన్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రఘునందన్‌రెడ్డికి చెందిన పొలంలో నుంచి ఉన్న విద్యుత్ లైన్‌కు విద్యుత్ తీగలు తెగి కిందపడిపోయాయి. మేత మేపడానికి రఘునందన్‌రెడ్డి పొలంలోకి మేకలను తీసుకెళ్లాడు. అక్కడ తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మేకలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. కాగా మృతిచెందిన మేకల విలువ రూ.35వేల వరకు ఉంటుందని బాధితుడు రఘునందన్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో విద్యుత్‌లైన్లన్నీ నేరుగా విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కనెక్షన్ ఉందని స్థానికులు తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తోందని తెలిపారు. దీని కారణంగా సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకుంటే మోమిన్‌కలాన్, రాజాపూర్, మోమిన్‌కుర్దు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు తెలిపినా ఫలితంలేకుండా పోయిందని తెలిపారు.

### నలుగురు పాత నేరస్థుల రిమాండ్



పోలీసుల అదుపులో నలుగురు దొంగలు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 1: నలుగురు పాతనేరస్థులను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బొందల మల్లేష్(40), భూపని ఆకాష్(27), షేక్ అల్లాఫ్(23), వెంకటప్రసాద్(24)లు నగరంలోని మల్లాపూర్ పారిశ్రామికవాడలో నివాసముంటూ దొంగతనాలను ప్రవృత్తిగా ఎంచుకున్నారు. గత నెల 7వ తేదీన ఈ నలుగురు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి కౌసల్యనగర్‌లో తాళంవేసిన వీరన్నగారి పోచిరెడ్డి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 41 గ్రాముల బంగారు ఆభరణాలు, 40తులాల వెండి పూజా సామగ్రిని అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా శనివారం సాయంత్రం ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోను గుర్తించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టిన పోలీసులు వారి వద్దనుంచి 41గ్రాముల బంగారు ఆభరణాలు, 40తులాల వెండి పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఓ ఆటోను సీజ్‌చేశారు. బొందల మల్లేష్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో 16కేసులు, భూపని ఆకాష్‌పై ఏడు కేసులు, వెంకటప్రసాద్‌పై మూడు కేసులు ఉన్నాయి. గతనెల 6వ తేదీన బొందల మల్లేష్ చర్లపల్లి జైలు నుంచి బయటకు వచ్చి నలుగురు ఒక టీంగా ఏర్పడి 7వ తేదీన ఘట్‌కేసర్‌లో దొంగతనం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. పలు కేసుల్లో జైలుకెళ్లినా వీరి బుద్ధి మారలేదు. నలుగురు నేరస్థులను శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### సైబర్ నేరగాళ్ల మోసం.. బ్యాంకు ఖాతాలో రూ.72వేలు మాయం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 1: బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలని వచ్చిన మేసేజ్‌కు స్పందించడంతో నగదు పోగొట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు చెందిన పాలవ్యాపారి బర్ల రాజుయాదవ్ సెల్‌ఫోన్‌కు యూనియన్ బ్యాంక్ ఖాతాకు ఆధార్‌కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని మెసేజ్ వచ్చింది. తన ఫోన్‌కు వచ్చిన మేసేజ్‌ను తన కొడుకు చూపించి అప్‌డేట్ చేయమన్నాడు. దీంతో ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగానే బ్యాక్ ఖాతా వివరాలు, పాన్‌కార్డు నెంబర్, ఓటీపీ చెప్పగానే బ్యాంక్‌ఖాతా నుంచి రూ.72వేల నగదు వెళ్లిపోయింది. రెండు రోజుల కిందటే ధాన్యం డబ్బులు బ్యాంక్‌ఖాతాలో జమయ్యాయని, అవే డబ్బులు ఖాతా నుంచి పోయాయని రాజు విలపించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.